సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం। 4। మార్చి। 2023



రామచంద్రస్వామికి అభిషేకం

వేములవాడ: రాజన్న సన్నిధిలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రోత్సవం సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు.



బ్యూటీషియన్ సర్టిఫికెట్లు ప్రదానం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో బ్యూటీషియన్ శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మోటార్లకు మీటర్లు లేవు



రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న సెస్ చైర్మన్ రామారావు

ముస్తాబాద్(సిరిసిల్ల): వ్యవసాయ కరెంట్ మోటార్లకు మీటర్లు ఉండబోవని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు స్పష్టం చేశారు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో రైస్‌మిల్లును శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నట్లు.. తాము వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోమన్నారు. యాసంగి పంటల సాగుకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామన్నారు. రైతులు కూడా ఆరు నెలలకోసారి నిర్వహణ చార్జీలు చెల్లించాలని కోరారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, జెడ్పీటీసీ నర్సయ్య, సర్పంచులు విజయ, గౌతంరావు, రైస్‌మిల్లుల సంఘం జిల్లా అధ్యక్షుడు చేపూరి నాగరాజు, విజయ రామారావు, సర్వర్, వినయ్, విష్ణు, జానబాయి, మహేశ్, దామోదర్‌రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంకు ఇన్‌చార్జి చైర్మన్‌గా విఠల్



ఇన్‌చార్జి చైర్మన్ విఠల్‌ను అభినందిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: అర్బన్‌బ్యాంకు ఇన్‌చార్జి చైర్మన్‌గా శుక్రవారం వైస్‌చైర్మన్ గడ్డం విఠల్ బాధ్యతలు స్వీకరించారు. బ్యాంకు చైర్మన్ చాంబర్‌లో ఉదయం జరిగిన కార్యక్రమంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి అభినందించారు. అర్బన్‌బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణ యూఎస్ పర్యటనకు దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా.. విఠల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. సెస్‌డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణపై పరిశీలన



మార్కెట్ భవనాన్ని పరిశీలిస్తున్న హైదరాబాద్ బృందం

వేములవాడ: వేములవాడ సుందరీకరణపై హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డిజైన్ లాటీస్ బృందం శుక్రవారం పరిశీలించింది. తహసీల్దార్ రాజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్ సమీకృత మార్కెట్ భవనాన్ని పరిశీలించారు. చైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మండల పరిషత్ ఆవరణ, శ్యామకుంటలోని సమీకృత మార్కెట్ భవన ప్రదేశాలను పరిశీలించినట్లు చెప్పారు. ఏఈ నర్సింహస్వామి, నాయకులు రాజు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన



తంగళ్లపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాలు పరిశీలిస్తున్న పీఎస్ శ్రీనివాస్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పీఎస్ కేటీఆర్ పీఏ గణరాజు, బీఆర్‌ఎస్ నాయకులు పూర్మాణి రాంలింగారెడ్డి, అధ్యక్షుడు రాజన్న, సింగిల్ విండో వైస్‌చైర్మన్ రమణారెడ్డి పాల్గొన్నారు.

కాలువలు నిర్మించారు.. సాగునీరు మరిచారు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సింగ సముద్రం కింద గొలుసుకట్టు చెరువులతోపాటు ఎగువమానేరుకు సాగునీరందించేందుకు 9వ ప్యాకేజీ కింద ఆరేళ్ల క్రితమే కాలువ పని పూర్తి చేశారని.. నీళ్లు ఇవ్వడం మరిచారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి దొమ్మాటి సాంబయ్య అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సిరిసిల్ల నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం ఈ కాలువను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాంబయ్య పరిశీలించారు.

వేళకు రారు..!

- సమయానికి ఉండరు
- ఇష్టానుసారంగా విధులకు హాజరు
- 'సెస్'లో సమయ పాలనపై పట్టింపేది?
- 'సాక్షి' పరిశీలనలో వెల్లడి

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సేవలందించే సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) ఆఫీస్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందిలో నిలువెల్లా నిర్లక్ష్యం పేరుకుపోయింది. సమయానికి విధులకు రావడం లేదు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వినియోగదారులు 'సెస్' ఆఫీస్‌కు వస్తే అధికారులు, సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవలందించే క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండగా.. ఆఫీస్‌లో విధులు నిర్వహించే ఉన్నతాధికారులు, వారి కింద పనిచేసే సిబ్బంది మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు.

సాక్షి ఫోకస్

స్థలం : సెస్ ఆఫీస్
సమయం : శుక్రవారం ఉదయం 11 గంటలు
విషయం : 'సెస్' ఆఫీస్‌లో విధులకు హాజరుకాని సిబ్బంది
సందర్భం : 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు విధులకు రాని సిబ్బందిని గుర్తించి వారికి సగం రోజు గైర్హాజరు వేయడం
ప్రత్యేకత : సమయపాలన పాటించకపోవడం
కొసమెరుపు: ఏళ్లుగా బదిలీలు లేకుండా ఒకే స్థానంలో పాతుకుపోవడం
విశేషం : వేలు... లక్షల రూపాయల్లో వేతనాలు ఉన్నా విధులను లెక్క చేయకపోవడం



ఉదయం 11.30 గంటలకు.. ఖాళీగా ఉన్న మెంబర్‌షిప్ రూమ్

ఖాళీ కుర్చీలే..

సిరిసిల్ల 'సెస్' ఆఫీస్‌ను శుక్రవారం 'సాక్షి' పరిశీలించగా.. అన్ని విభాగాల్లోనూ ఖాళీ కుర్చీలు.. బెంచీలు కనిపించాయి. ఏఏవో దేవేందర్, జేఏవో(టౌన్) శ్రీనివాస్‌రెడ్డి, ఏఏఈ స్రవంతి (పర్చేజ్), ఎల్‌డీసీ బ్రహ్మం, వేణుకుమార్, రాజేశ్ కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ఇంకా చాలా మంది అధికారుల కుర్చీలు ఖాళీ ఉన్నా.. వారు ఫీల్డ్ విధుల్లో ఉండే అవకాశం ఉంది. 'సెస్' ఆఫీస్‌లో 48 మంది సిబ్బందికి 19 మంది మాత్రమే ఉన్నారు. అదే ఫీల్డ్‌స్టాఫ్ ఆఫీస్‌లో 36 మందికి 16 మంది ఉన్నారు. ఏది ఏమైన 'సెస్' ఆఫీస్‌లో ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరిదీ అదే దారి అన్నట్లుగా ఉంది.



ఖాళీగా ఉన్న డీఈఈ ఆఫీస్ గది



ఖాళీగా ఉన్న ఆపరేటివ్ ఆడిటర్ల గది



ఖాళీగా ఉన్న సిరిసిల్ల టౌన్-1 ఏఏఈ చాంబర్

బయోమెట్రిక్ లేదు.. కనిపించని సీసీ కెమెరాలు

సిరిసిల్ల 'సెస్' ఆఫీస్‌లో సిబ్బందికి బయోమెట్రిక్ (వేలిముద్ర) వేసే విధానం లేదు. బయోమెట్రిక్ హాజరు ఉంటే ఆలస్యంగా వస్తే ఆటోమేటిక్‌గా ఆబ్సెంట్(గైర్హాజరు) పడుతుంది. కానీ సెస్ ఆఫీస్‌లో ఇప్పటికీ సంతకాలు చేసే పద్ధతిలోనే హాజరు అమలవుతుంది. మరోవైపు ఆఫీస్ సిబ్బంది ఎప్పుడు వస్తున్నారు.. ఎప్పుడు వెళుతున్నారో.. పరిశీలించేందుకు సీసీ కెమెరాలు లేవు. గతంలో ఉన్న సీసీ కెమెరాలను తొలగించారు. 'సెస్'లో పనిచేసే ఉద్యోగుల్లో చాలా మంది స్థానికులే కావడంతో వారిని అడిగేవారు లేక ఇలా బాధ్యతారాహిత్యంగా పని చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సరైన పర్యవేక్షణ లేక సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



'సెస్' ఆఫీస్‌లో అందరూ సమయానికి విధులకు రావాల్సిందే. వేళకు విధులకు రాని వారికి ఈరోజు నేను దగ్గరుండి మరీ గైర్హాజరు వేయించాను. బయోమెట్రిక్ విధానం అమలు చేస్తాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. శుక్రవారం ఖాళీ కుర్చీలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. విధులను నిర్లక్ష్యం చేస్తే సహించం. అందరూ బాధ్యతగా పనిచేయాల్సిందే.

– చిక్కాల రామారావు, 'సెస్' చైర్మన్, సిరిసిల్ల

సమస్యలు తెలుసుకుంటూ..
ముందుకు సాగుతూ..

- మానకొండూర్ నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగిన రేవంత్‌యాత్ర
- 15 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజలతో మమేకమైన కాంగ్రెస్ చీఫ్
- మానకొండూర్ సభలో బీఆర్‌ఎస్ నేతలపై నిప్పులు



మానకొండూర్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి,



స్వాగతం పలుకుతున్న ఆది శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి

తిమ్మాపూర్/మానకొండూర్: భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం నుంచి శుక్రవారం ప్రారంభమైన యాత్ర మానకొండూర్ వరకు ఉత్సాహంగా సాగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు రేవంత్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఊరూరా కార్యకర్తలు, ప్రజలు, మహిళలు రేవంత్‌కు ఘనస్వాగతం పలికారు. మొగిలిపాలెంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి సుస్మితారమణారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమైంది. పర్లపల్లి వరకు బైక్‌ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి పోలంపల్లికి చేరుకొని మధ్యాహ్నం 12.30 గంటలకు గ్రామశివారులో భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పాదయాత్ర ప్రారంభంకాగా 7 గంటల వరకు మానకొండూరు చేరారు. సుమారు 15 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. మధ్యలో మల్లాపూర్‌లో సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి ఇంట్లో టీ విరామం తీసుకున్నారు. మన్నెంపల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణ చేశారు. పోరండ్లలో బొజ్జ లచ్చవ్వ తన భర్త ఐదేళ్ల క్రితం చనిపోయినా.. తన పేరున భూమి మార్పిడి జరగడంలేదని రేవంత్‌కు విన్నవించింది. సాక్షర భారత్ కోఆర్డినేటర్లను విధుల్లో నుంచి తొలగించినందుకు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తాము అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సెక్యూరిటీ అత్యుత్సాహం

పాదయాత్ర భోజన విరామ సమయంలో ప్రైవేట్ సెక్యూరిటీ అత్యుత్సాహం చూపించారు. ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మీడియా ప్రతినిధులతో దురుసుగా మాట్లాడారు. బౌన్సర్ల నిర్లక్ష్యంతో ఓ డప్పు కళాకారుడికి స్వల్ప గాయాలయ్యాయి. తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి వద్ద గీకురు నర్సయ్యను రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లోని కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. సాయంత్రం ఏడుగంటలకు మానకొండూర్‌లో సభ నిర్వహించారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి మండల కేంద్రం శివారులోని పద్మనగర్‌కు చేరుకున్నారు. రేవంత్‌రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి స్వాగతం పలికారు.

అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తాం

మానకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొందరు బీఆర్‌ఎస్ వాళ్లు కాంగ్రెస్ ఏం చేసిందని మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, ఉచిత కరెంటు, ఫీజు రీయింబర్స్‌మెంటు అందించామని అన్నారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు జాతీయ రహదారి, ఔటర్‌రింగురోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. మీరు ఇప్పుడు సెల్ఫీలు దిగుతున్న శిల్పారామం కాంగ్రెస్ కట్టిందేనని కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ.. ఎద్దేవా చేశారు. రెండుసార్లు అవకాశం ఇస్తే రాష్ట్రానికి సీఎంగా కేసీఆర్, మానకొండూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తనకన్నా ముందు ముగ్గురు ఎంపీలు కరీంనగర్ నుంచి ప్రాతినిధ్యం వహించారని, వారు పదిశాతం కూడా అభివృద్ధి చేయలేదని అన్నారు. ఒకవేళ తనకన్నా ఎక్కువ అభివృద్ధి చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని పొన్నం సవాల్ విసిరారు. డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మానకొండూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. గుండ్లపల్లి నుంచి పొత్తూర్ వరకు రహదారి నిర్మాణం తమ పోరాటమే అని గుర్తు చేశారు. రసమయిని నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్యరావు థాక్రే, మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, అంజనికుమార్‌యాదవ్, వేణుగోపాల్, మానకొండూర్ మండలాధ్యక్షుడు రవీంద్రచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌గౌడ్, శంకర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల నమోదుపై దృష్టి పెట్టండి

- కలెక్టర్ అనురాగ్‌జయంతి
- బోయినపల్లి మండలంలో సుడిగాలి పర్యటన



వైద్యసిబ్బందితో కలెక్టర్ అనురాగ్ జయంతి

బోయినపల్లి(చొప్పదండి): సబ్‌సెంటర్ వారీగా గర్భవతుల నమోదుపై ఏఎన్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యారోగ్యశాఖ అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అనురాగ్‌జయంతి ఆదేశించారు. బోయినపల్లిలోని పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యసిబ్బందితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల రెండు డెలివరీలు ప్రైవేటులో జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువు దాటిన మందులు ఎప్పటికప్పుడు తీసివేయాలని ఫార్మసిస్ట్‌ను ఆదేశించారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

'మన ఊరు–మన బడి' పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బోయినపల్లి హైస్కూల్‌లో రూ.14 లక్షలతో చేపడుతున్న కాంపౌండ్, డైనింగ్‌హాల్ పనులను పరిశీలించారు. మొదట బూర్గుపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డీఈవో రమేశ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ గుప్తా, డాక్టర్ రజిత, కంటివెలుగు ప్రోగ్రాం అధికారి శ్రీరాములు, సర్పంచ్ గుంటి లతశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారి రేణుక, డీడీఎం డీఈవో కార్తీక్, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో గంగాతిలక్, ఆర్‌ఐ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి రాజసులోచన, హెచ్‌ఎం ప్రేమలత పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి

సిరిసిల్లఅర్బన్: దళితబంధు పెండింగ్ యూనిట్ల గ్రౌండింగ్ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాల అధికారులతో సమీక్షించారు. దళితబంధు వివరాలు మొబైల్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. డెయిరీ యూనిట్లను గ్రౌండింగ్ చేయాలన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై రైతులను చైతన్యం చేయాలని, మన ఊరు–మన బడి ద్వార చేపట్టిన పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, డీపీవో రవీందర్, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, డీఈవో రమేశ్‌కుమార్, ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో భక్తుల కోలాహలం

- రేపు కామదహనం వేడుకలు
- 9 నుంచి శివకల్యాణోత్సవాలు
- 10న పార్వతీరాజేశ్వరుల కల్యాణం
- 12న రథోత్సవం



వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తులతో రద్దీగా మారింది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఈనెల 5న సాయంత్రం ప్రదోషపూజ అనంతరం కామదహనం, మహామంటపంలో డోలోత్సవం నిర్వహిస్తారు. ఈనెల 9 నుంచి రాజన్న సన్నిధిలో శివకల్యాణోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 10న పార్వతీరాజరాజేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ప్రకటించారు. ఈనెల 12న సాయంత్రం 4 గంటల నుంచి రథోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య
- నేడు సిరిసిల్లలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

సిరిసిల్లటౌన్: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర శనివారం ప్రారంభమవుతున్న సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. ఇన్నేళ్లుగా కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాయన్నారు. ప్రజాసమస్యలను ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కుతులన్న పార్టీలకు నూకలు చెల్లాయని హెచ్చరించారు. పాదయాత్ర ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబయ్య, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పార్టీ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, శ్రీదేవి, దేవరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వర్సెస్..మున్సిపల్ కమిషనర్

రోడ్ల వెంట కట్టిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలను మున్సిపల్ సిబ్బంది తొలగించడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు.

పాదయాత్ర విజయవంతం చేయండి

వేములవాడ: జిల్లాలో శనివారం ప్రారంభమయ్యే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ శుక్రవారం కోరారు. పాదయాత్రలో జిల్లా ప్రజలు అత్యధికంగా పాల్గొనాలని కోరారు.

డీఎల్‌పీవోపై కొనసాగుతున్న విచారణ

- లిఖిత పూర్వకంగా రాసిచ్చిన సర్పంచులు
- నోరువిప్పని పంచాయతీ కార్యదర్శులు
- సమగ్ర వివరాలు ఇవ్వని డీఎల్‌పీవో
- 'సాక్షి' కథనంతో సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశాలు



పల్లెల్లో వసూళ్లకు
చె'కింగ్'..!

'సాక్షి'లో ఫిబ్రవరి 22న ప్రచురితమైన కథనం

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా డివిజినల్ లెవల్ పంచాయతీ అధికారి(డీఎల్పీవో) రాగంపేట మల్లికార్జున్‌పై రెండో రోజు శుక్రవారం కలెక్టరేట్‌లో విచారణ కొనసాగింది. జిల్లాలో పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారుల వద్ద డీఎల్పీవో డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు 'సాక్షి'లో 'పల్లెల్లో వసూళ్లకు చెకింగ్' అనే శీర్షికన ఫిబ్రవరి 22న కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రాథమిక విచారణ చేపట్టిన కలెక్టర్ అనురాగ్ జయంతి డీఎల్పీవో మల్లికార్జున్‌ను సస్పెండ్ చేశారు. సమగ్ర విచారణ కోసం జిల్లా ఆడిట్ అధికారి స్వరూపను ఆదేశించారు. జిల్లా ఆడిట్ అధికారి స్వరూప గురువారం పంచాయతీ కార్యదర్శులను, గ్రామాల సర్పంచులను విచారించారు. కొందరు గ్రామ సర్పంచ్‌లు డీఎల్‌పీవో వసూళ్లపై లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు సమాచారం. పంచాయతీ కార్యదర్శులు మాత్రం ఎలాంటి ఫిర్యాదు చేయకుండా మౌనంగా ఉన్నట్లు తెలిసింది. శుక్రవారం జిల్లా ఆడిట్ ఆఫీస్ వద్దకు విచారణకు వచ్చిన డీఎల్‌పీవో మల్లికార్జున్ సరైన వివరాలు ఇవ్వకుండా.. వెళ్లినట్లు తెలిసింది. జిల్లా ఆడిట్ అధికారి వద్ద జరిగే విచారణకు రావద్దని, వచ్చినా తనకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయొద్దని డీఎల్పీవో.. ముందుగానే పంచాయతీ కార్యదర్శులు, బాధిత సర్పంచులను కలిసి బతిమిలాడినట్లు సమాచారం. తనకు కొద్ది నెలలే సర్వీసు ఉందని, ఈ దశలో ఇబ్బందులకు గురిచేయొద్దని, మీరు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తానంటూ.. ప్రాధేయపడినట్లు తెలిసింది. అయితే మరో మూడు రోజుల్లో విచారణ పూర్తవుతుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

నేరాలను నియంత్రించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ఆ ప్రాంతంలో నిఘా పెంచాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. అనుమానిత ప్రదేశాలలో బ్లూ కోట్స్, పెట్రోకార్స్ సిబ్బంది తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం బ్లూ కోట్, పెట్రోకార్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నేరం చేస్తే పట్టుబడతామనే భయం నేరస్తుల్లో కలిగేలా బ్లూకోట్స్ సిబ్బంది, అధికారులు తమ ఏరియాపై పట్టుసాధించాలన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐ వెంకటేశ్, బ్లూ కోట్స్, పెట్రోకార్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టాన్ని కాపాడాలి

కోనరావుపేట(వేములవాడ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ సూచికబోర్డులు, ఆడియోతో కూడిన సీసీ కెమెరాలు పెట్టాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్స్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీలకు శుక్రవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆర్టీఐ యాక్టివిస్ట్‌లపై జరుగుతున్న దాడులను నివారించాలని కోరారు. జిల్లా బాధ్యులు నేవూరి రత్నాకర్, ఎర్ర బాలకిషన్, నంది శ్రీపివాస్‌రెడ్డి, యశోద రాజు, సయ్యద్‌సలీం పాల్గొన్నారు.

క్లుప్తంగా

రజకులకు అండగా ప్రభుత్వం

● రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్


అక్కరాజు శ్రీనివాస్

వేములవాడరూరల్ : రజకులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వాలు అట్టడుగు వర్గానికి చెందిన రజకులకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. హైదరాబాద్‌లో రజకుల కోసం ప్రత్యేకంగా భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించిందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 141 మున్సిపాలిటీల్లో దోబీఘాట్లను నిర్మించేందుకు దాదాపు రూ.282 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాష్ట్ర రజక సంఘం తరుపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అసిస్టెంట్ హెల్పర్‌కు గాయాలు


గాయపడిన శ్రీనివాస్

ముస్తాబాద్ : మండలంలోని పోతుగల్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేర్ చేస్తుండగా అసిస్టెంట్ హెల్పర్ జంగ శ్రీనివాస్ (24) గాయపడ్డాడు. గ్రామశివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో శుక్రవారం సాంకేతిక సమస్య తలెత్తడంతో లైన్‌మెన్ ప్రభు రిపేర్ చేస్తుండగా శ్రీనివాస్ సాయం చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా కావడంతో శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స కోసం ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సెస్ డైరెక్టర్ విజయరామారావు, జెడ్పీటీసీ నర్సయ్య, సర్పంచ్ గౌతంరావు, ఏఈ మహేశ్, తదితరులు శ్రీనివాస్‌ను పరామర్శించారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం


చెక్కులు అందిస్తున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆర్థికాభివృద్ధి కోసం రుణాలు మంజూరు చేస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెయిరీ, గొర్రెలు, కోళ్ల పెంపకంతో పాటు ట్రాక్టర్, హార్వెస్టర్ల కోసం రుణాలు అందిస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్ల గొల్లపల్లి, దుమాల గ్రామ శివారుల్లో శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు పెట్టినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు.

గల్ఫ్ ఏజెంట్ నకి'లీలలు' !

- స్వగ్రామంలో ఉపాధి కరువై గల్ఫ్‌బాట
- నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న ఏజెంట్లు
- నకిలీ వీసాలతో మోసం
- జిల్లాలో వందల సంఖ్యలో నకిలీ ఏజెంట్లు
- మోసం చేస్తే పీడీయాక్ట్ : ఎస్పీ



జిల్లాలో నమోదైన కేసులు

2012	2022	2023
4	10	4

సిరిసిల్లక్రైం: నిరుద్యోగ యువత అవకాశాలను గల్ఫ్ ఏజెంట్లు ఆసరాగా చేసుకుంటున్నారు. గల్ఫ్ దేశంలోని పరిస్థితుల గురించి తెలియని వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తూ నకిలీ వీసాలు అంటగడుతున్నారు. కొందరు ఎయిర్‌పోర్టుల్లో నుంచే తిరిగొస్తుండగా.. మరికొందరు గల్ఫ్ దేశాలకు వెళ్లి అష్టకష్టాలు పడుతున్నారు. అప్పులపాలవుతున్న వారు కొందరు మనోవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా గురువారం రాత్రి రుద్రంగి మండల కేంద్రానికి చెందిన వాసాల నరేశ్ ఆత్మహత్య నకిలీ వీసా మోసాలపై చర్చకు తావుతీసింది. యువకుడి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇద్దరు కూతుళ్ల భవిష్యత్ అంధకారమైంది.

జిల్లాలో ఏడు అధికారిక కంపెనీలు

గల్ఫ్ దేశాల్లోని వివిధ కంపెనీలకు కార్మికులను సరఫరా చేసేందుకు జిల్లాలో అధికారిక మ్యాన్‌పవర్ కంపెనీలు ఉన్నాయి. వీటికీ పదింతలు నకిలీ ఏజెంట్లు గ్రామాల్లో నిత్యం కనిపిస్తూనే ఉన్నారు. పల్లెల్లో తిరుగుతూ మంచి వేతనం ఉందంటూ మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఫుడ్, బెడ్ కంపెనీలదేనని చెప్పి అందినకాడికి వసూలు చేసుకుంటున్న నకిలీ ఏజెంట్లు జిల్లాలో ప్రతీ పల్లెలో కనిపిస్తున్నారని తెలిసింది.

మోసాలు ఇలా..

- పల్లెల్లోకి వస్తున్న ఏజెంట్లు మంచి వేతనంతో పని ఉందంటూ మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారు.
- నగదు ముట్టిన తర్వాత ఏజెంట్ నుంచి సమాధానం ఉండదు. వీసా కోసం తీవ్ర ఒత్తిడి చేస్తే ఏదో ఒక పాత వీసాపై తేదీ, పేరు మార్చి ఇచ్చిన సంఘటనలు జిల్లాలో అనేకం జరిగాయి. ఇలాంటి వీసాలతో ఎయిర్‌పోర్టుకు వెళ్తే వెనక్కి తిరిగిరావాల్సిందే.
- ఇలా నకిలీ వీసాలతో ముంబై, చెన్నైలకు వెళ్లిన వారు ఇంటికి రాలేక, అప్పులు తీర్చేందుకు ఆయా పట్టణాల్లోనే పనిచేస్తున్నారు.

గాడితప్పిన 'గల్ఫ్ సెల్'

గల్ఫ్ దేశానికి వెళ్లే వారు అధికంగా ఉన్నారని తెలిసి వారికి వచ్చే వీసాలు తనిఖీ చేసేందుకు సిరిసిల్ల జిల్లాగా ఏర్పడిన సమయంలో అప్పటి ఎస్పీ విశ్వజిత్ కాంపాటి గల్ఫ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సీఐ స్థాయి అధికారికి విధులు కేటాయించారు. గల్ఫ్ దేశానికి వెళ్లే వారు తమకు వచ్చిన వీసాలను ఇక్కడ ఉండే అధికారులకు అందించి వాస్తవాలు తెలుసుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే జిల్లాలో అనధికారిక గల్ఫ్ ఏజెంట్లపై కొరడా ఝుళిపించారు. ఏకంగా వందకుపైగా ఏజెంట్లపై కేసులు నమోదు చేశారు. తర్వాత కాలంలో గల్ఫ్ సెల్ సేవలు కుంటుపడడంతో పోలీస్ అధికారులు స్టేషన్ పరిధిలోనే నకిలీ ఏజెంట్లపై కేసులు నమోదు చేస్తున్నారు.

మోసగిస్తే పీడీయాక్టు



పేదలకు నకిలీ వీసాలు అంటగట్టి మోసానికి పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై నిఘా పటిష్టం చేస్తాం. వీసాలను తనిఖీ చేయించిన తర్వాత వెళ్లాలి. లక్షల రూపాయలు ఇచ్చిన తర్వాత వాటిని రాబట్టడం శ్రమతో కూడిన పని. ఎవరైన గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు అధికారిక ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలి.

– అఖిల్‌మహాజన్, ఎస్పీ, రాజన్నసిరిసిల్ల

ఏజెంట్ మోసానికి యువకుడి బలి

- రూ.1.50 లక్షలు తీసుకొని నకిలీ వీసా ఇచ్చిన ఏజెంట్
- గతంలో రెండు సార్లు గల్ఫ్ వెళ్లి తిరిగొచ్చిన నరేశ్
- మూడోసారి మోసపోయిన యువకుడు
- అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య


రోదిస్తున్న మృతుని భార్య, కూతుళ్లు


నరేశ్ (ఫైల్)

రుద్రంగి(వేములవాడ): పుట్టిన ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ బాట పట్టిన యువకుడికి నిరాశె ఎదురైంది. గల్ఫ్ ఏజెంట్ చేసిన మోసానికి అప్పులు తీర్చే మార్గం కనిపించక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుడి కుటుంబం తెలిపిన వివరాలు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన వాసాల నరేశ్(30) స్వగ్రామంలో ఉపాధి దొరక్క అప్పు చేసి గల్ఫ్ బాట పట్టాడు. రెండు సార్లు విదేశాలకు వెళ్లిన నరేశ్‌కు అక్కడ సరైన పనులు లేక తిరిగి వచ్చాడు. మూడోసారి గల్ఫ్ దేశం వెళ్లేందుకు రుద్రంగికి చెందిన తెలిసిన వ్యక్తిని వీసా కోసం కలిశాడు. మలేషియాలో పని ఉందని రూ.1.50 లక్షలు వీసా కోసం ఇచ్చాడు. ఏజెంట్ ఇచ్చిన వీసాతో నరేశ్ చెన్నై ఎయిర్‌పోర్టుకు వెళ్లగా.. అక్కడి సిబ్బంది పరీక్షించి నకిలీ వీసా అని చెప్పడంతో ఇంటికి తిరిగొచ్చాడు. ఊరిలో పెద్దమనుషుల వద్దకు పిలిపించి పంచాయితీ పెట్టినా ఫలితం లేకుండా పోయింది. అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురైన నరేశ్ గురువారం రాత్రి రుద్రంగిలోని తన ఇంటి సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. నరేశ్‌కు తల్లిదండ్రులు, భార్య లత, ఇద్దరు కూతుళ్లు లాస్య(8), సంధ్య(5) ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రుద్రంగి ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

రౌడీషీటర్ హత్య కేసులో ఇద్దరి రిమాండ్

- ప్రాణాలు తీసిన వివాహేతర సంబంధం


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సై లక్ష్మారెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన రౌడీషీటర్ కొమిరె వాసు(40) హత్య మిస్టరీ వీడింది. 'సాక్షి' ముందుగా చెప్పినట్లు సహజీవనం చేస్తున్న మహిళ ఇద్దరు కూతుళ్లపై వాసు కన్నేయడంతోనే కడతేర్చినట్లు నిందితురాలు ఒర్సు గౌరవ్వ పోలీసుల ఎదుట ఒప్పుకుంది. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు. ఇందిరమ్మకాలనీకి చెందిన ఒర్సు గౌరవ్వకు ఇద్దరు కూతుళ్లు.. కాగా భర్తతో దూరంగా ఉంటోంది. రౌడీషీటర్ వాసు అలియాస్ ఏసుతో ఐదేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఈక్రమంలో వాసు.. గౌరవ్వ ఇద్దరు కూతుళ్లపై కన్నేశాడు. వాసు నుంచి తన కూతుళ్లను రక్షించుకునేందుకు గురువారం అర్ధరాత్రి ఒంటి గంటకు మద్యంమత్తులో ఉన్న వాసును సుత్తెతో మోది హత్య చేసింది. అనంతరం శవాన్ని తన అల్లుడు పల్లెపు దినేశ్ సాయంతో స్కూటీపై సారంపల్లి శివారు కొమురయ్యకుంట వద్దకు తీసుకెళ్లి పడేశారు. స్కూటీని మరికొంత దూరంలో వదిలేసి వచ్చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ఇందిరమ్మకాలనీలో శుక్రవారం మధ్యాహ్నం నిందితులు కనిపించడంతో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు రూరల్ సీఐ ఉపేందర్ వివరించారు. గౌరవ్వ, దినేశ్‌లను కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో తంగళ్లపల్లి ఎస్సై పి.లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ట్రినిటీ'లో ఆకట్టుకున్న యూత్ ఫెస్ట్ మేధా-23


జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో స్టేట్ లెవల్ యూత్ ఫెస్ట్ మేధా–23ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, షార్ట్ ఫిలిమ్స్, క్విజ్ తదితర పోటీలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ, ఉస్మానియా, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, ఏవో రాధాకృష్ణ, హెచ్‌వోడీలు బలరాం, శ్రీధర్, సంపత్, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు
- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రయ్యగౌడ్

కోనరావుపేట : మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించినా వివిధ శాఖల అధికారులు హాజరు కావడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు ప్రశ్నించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. మరిమడ్ల శ్మశాన వాటికలో బోరువేసినా మోటార్ మంజూరు చేయకపోవడంతో నిరుపయోగంగా మారిందని సర్పంచ్ మాట్ల అశోక్ తెలిపారు. మిషన్ భగీరథలో పనులు చేసిన సర్పంచులకు ఈజీఎస్ డబ్బులు జమకావడం లేదని సర్పంచ్ దేవయ్య అన్నారు. నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్ట్ కింద రహదారిని ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ ఇస్లావత్ రాములు నాయక్ సభ దృష్టికి తీసుకెళ్లారు. మూలవాగు వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాంలు ఇంకా పూర్తి కావడం లేదని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎంపీపీ

మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణం కోసం ఒక్కో గ్రామ పంచాయతీ భవనానికి సుమారు రూ. 20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో రామకృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, అన్నిగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్


మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్ల టౌన్: అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు కట్టుకునేందుకు ఒక్కొక్కరికి రూ. 5లక్షలు చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. పేదల సొంతింటి కల నెరవేరేవరకు పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కోడం రమణ, సూరం పద్మ, సామల కవిత, గోవిందు లక్ష్మణ్, యెలిగేటి రాజశేఖర్, నక్క దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ


రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో ప్రొఫెసర్లు, అంగన్‌వాడీలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో ఆహారం, పోషణ భద్రతపై జిల్లాలోని అంగన్‌వాడీలకు హైదరబాద్‌లోని రాజేంద్రనగర్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగిన శిక్షణలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్స్ డా. సీమ, డా.రత్నకుమారి, సత్యనారాయణ, నగేష్, ప్రొఫెసర్లు సునందిని, సంపత్, సిరిసిల్ల సీడీపీవో అలేఖ్య ఉన్నారు.

ప్రభాకర్‌కు అరుదైన గౌరవం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని లింగన్నపేటకు చెందిన తంగళ్లపల్లి ప్రభాకర్‌కు సాహిత్యంలో అరుదైన గౌరవం లభించింది. గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ మంథని అందించే జాతీయస్థాయి నంది అవార్డుకు ప్రభాకర్ ఎంపికయ్యారు. సాహితీరంగంలో ప్రభాకర్ చేస్తున్న సేవలు, రచనలు, కవిత్వాలకు జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 19న మంథని వేదికగా జాతీయస్థాయి సాహిత్య సదస్సులో ప్రభాకర్ నంది అవార్డును, సాహితీ కిరణం బిరుదును అందుకోనున్నారు.

నా సంతకాన్ని ఫోర్జరీ చేశారు

- జిల్లా బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు, సింగిల్ విండో చైర్మన్ బర్కం వెంకటలక్ష్మి


మాట్లాడుతున్న బర్కం వెంకటలక్ష్మి

సిరిసిల్ల అర్బన్ : తన సంతకాన్ని ఫోర్జరీ చేసి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు, సింగిల్ విండో చైర్మన్ బర్కం వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెద్దూరు సింగిల్‌విండో చైర్మన్‌గా మూడేండ్లుగా పనిచేస్తున్నానని, బీఆర్‌ఎస్ నాయకులు రాజీనామాపత్రం సృష్టించడంతో పాటు తన సంతకాన్ని ఫోర్జరీ చేసి, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కక్ష్య పూరితంగానే కొంతమంది డైరెక్టర్లు అవిశ్వాసానికి తెరలేపారన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలు రేగుల రేణుక, చొప్పదండి స్వరూప, పద్మ, కొండ నరేశ్, సదానందం, తదితరులున్నారు.

పోలీస్ సిబ్బందిపైకి దూసుకెళ్లిన ఆటో..


చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నాగరాజు

వేములవాడ రూరల్: ఆటో అదుపుతప్పి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిపైకి దూసుకెళ్లడంతో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి మండలంలోని వట్టెంల బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో వేములవాడ నుంచి వట్టెంలకు వెళ్తున్న ఆటో వేగంగా సిబ్బందిపైకి దూసుకెళ్లడంతో కానిస్టేబుల్ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆటో కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బీజేపీ నేతల నివాళి


కొవ్వొత్తులతో బీజేపీ నేతల ర్యాలీ

సిరిసిల్ల టౌన్: మెడికో విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతిపై బీజేపీ నేతలు నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రీతి మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, చొప్పదండి అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫేర్‌వెల్ డే వేడుకలు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గంభీరావుపేట (సిరిసిల్ల): మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ డే వేడుకలను నిర్వహించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటి నాయక్, సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు, సెస్ డైరెక్టర్ నారాయణ రావు, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, గంగారాం, బాల ఎల్లయ్య, లింగారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు హాత్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభం


పద్మనగర్‌లో ఏర్పాట్లు చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల) : హాత్ సే హాథ్ జోడో యాత్రను టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి శనివారం జిల్లాలోని తంగళ్లపల్లి మండలకేంద్రంలో ప్రారంభించనున్నారు. శుక్రవారం రాత్రి తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామానికి రేవంత్‌రెడ్డి చేరుకోనున్నట్లు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆయన బసచేసేందుకు గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంనుంచి రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడోయాత్రను ప్రారంభించి సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేరుకుంటారు.




సాక్షి ఎఫెక్ట్..

రోడ్లు శుభ్రం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని రోడ్లు దుమ్ము, ధూళితో నిండుకున్నాయని సాక్షిలో శుక్రవారం 'దుమ్మెత్తిపోస్తున్న రోడ్లు' శీర్షికన ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. వేములవాడ మున్సిపల్ మేనేజర్ సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది శుక్రవారం పట్టణంలోని ప్రధాన రోడ్లను శుభ్రం చేశారు.